క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సంపేట రూరల్ : మండలంలోని నాగుర్లపల్లి, దాసరిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెయింటనెన్స్ కింద విద్యుత్ కోత విధిస్తున్నామని శాఖ ఏఈ సంపత్ పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరా అంతరాయానికి ఆయా గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి రండి

పర్వతగిరి: మండల కేంద్రంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే పర్వతాల శివాలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సమ్మయ్యకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు ప్రతి ఒక్కరు హాజరు కావాలని వారు కోరారు. ప్రిన్సిపాల్‌ను కలిసిన వారిలో ఆహ్వాన కమిటీ సభ్యులు రజిత, విశాలక్ష్మి, సుమలత, శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



గీసుకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సట్ల రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఇన్‌స్పెక్టర్ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి, లెనిన్‌గౌడ్, అర్చకులు ఉన్నారు.

విద్యార్థులకు చేయూత



గీసుకొండ: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మరియపురం సర్పంచ్, నిర్మల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అల్లం బాలిరెడ్డి రూ.75 వేల స్వంత ఖర్చుతో టై, బెల్టు, ఐడీ కార్డులను శుక్రవారం అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలతో పాటు, జెడ్పీ పాఠశాలకు చెందిన 5 నుంచి 9 తరగతుల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలను అందించారు. ఈ నెల 26 నాటికి రెండు పాఠశాలల విద్యార్థులందరికీ షూస్‌ను అందించడానికి రూ. 50 వేల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్యోత్స్న, ప్రభ, శ్రీనివాస్, సర్పంచ్ దొడు బాబు, కర్ణకంటి రాంమూర్తి, విఠోబా, ఉపాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ శివారులోని హరియా నాయక్ తండాకు చెందిన లావుడ్య దేవ్‌సింగ్ పూరిగుడిసె అగ్ని ప్రమాదంలో ఇటీవల దగ్ధం కావడంతో కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, సర్పంచ్ తూటి పావని, రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులిచేరు రాజేందర్ ఆధ్వర్యంలో రూ. 5000తో పాటు 50 కిలోల బియ్యం, దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో ఉపసర్పంచ్ వీరన్న నాయక్, బోనగిరి సారయ్య, పెద్ద వీరు, బాలు, హరీష్, వెంకన్న, అశోక్, ఉన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



గీసుకొండ: మండలంలోని కొమ్మాల సర్పంచ్ వీరాటి సునిత, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ 5వ వార్డు సభ్యుడు బోగి శ్రీనివాస్, స్థానికులు టి. బ్రహ్మచారి శుక్రవారం కలెక్టర్ గోపికి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో గ్రామపంచాయతీకి సంబంధించి రూ. 50 లక్షల అవినీతి జరిగిందని 2020 జనవరి 20న అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. 2021–22 సంవత్సరంలో కొమ్మాల అంగడి ఆదాయం రూ. 10 లక్షలను దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులను సస్పెండ్ చేయాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో టెండర్ లేకుండా పార్కు నిర్మాణం పనులు చేసి లక్షలాది రూపాయలను అక్రమంగా డ్రా చేశారని, సంబంధిత ఏఈపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

ఆదమరిచారో.. అంతే సంగతులు

- గుంతలమయంగా జమలాపురం, కొంకపాక మధ్య రోడ్డు
- భారీ వాహనాల రాకతో ధ్వంసమైన రోడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు

పర్వతగిరి : వాహనదారులు ఆద మరిచారో అంతే సంగతులు. మండలంలోని జమలాపురం గురుకుల పాఠశాల నుంచి కొంకపాక శివారు తీగరాజుపల్లి వరకు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి చింత నెక్కొండ వరకు రోడ్లన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రెండు రోడ్డు మార్గాల్లో ప్రయాణం ప్రమాదకరమని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మార్గాలను సరిచేసి ప్రయాణికులను ప్రాణాల నుంచి రక్షించాలని వాహనదారులు డిమాండ్ కోరుతున్నారు.



ధ్వంసమైన జమలాపురం వెళ్లే రహదారి (ఇన్‌సెట్‌లో) గుంతలమయంగా ఉట్టితండాకు వెళ్లే దారి

అధిక లోడుతో దెబ్బతిన్న రోడ్లు



అధికలోడు వాహనాలు రావడంతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోయిన తర్వాత రోడ్లు మరమ్మతు చేస్తే ఏం లాభం. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను నివారించాలి.

– జిల్లా కనకయ్య, జమలాపురం

వాహనాలు జాగ్రత్తగా నడపాలి



జమలాపురం నుంచి తీగరాజుపల్లి క్రాస్‌వరకు, పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి చింతనెక్కొండ వరకు గుంతలు ఉన్నవి వాస్తవమే. గుంతలను గమనించి వాహనాలను వేగంగా నడపకుండా చూసుకోవాలి. అజాగ్రత్త వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– ఎస్సై దేవేందర్

ప్రభుత్వ విధానాలతో విసుగు చెందిన ప్రజలు

నర్సంపేట : బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వ విధానాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి అన్నారు. పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం 8, 16, 23, 24 డివిజన్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. పార్టీ కమిటీల కష్టంపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. కాంగ్రెస్‌కు మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కమిటీలను వేశారు. 8వ డివిజన్ అధ్యక్షుడిగా గిరగాని రమేష్, ఉపాధ్యక్షులుగా ముత్యం సూరయ్య, మాచర్ల మహేష్, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి సతీష్‌రావు, కోశాధికారి సంగెం కుమార్ ఎన్నికయ్యారు. 16వ డివిజన్ అధ్యక్షుడిగా గణిపాక రమేష్, ప్రధాన కార్యదర్శి కోడిపుంజుల శ్రీనివాస్, కోశాధికారి బానాల బాబు, ముఖ్య సలహాదారులు బానాల శ్రీనివాస్, వేముల సారంగం, దేవులపల్లి వేణు, 23వ డివిజన్ అధ్యక్షుడిగా పెద్దపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మడితపెల్లి సాగర్, సహాయ కార్యదర్శి గడ్డం రాజేష్, 24వ డివిజన్ అధ్యక్షుడు కోల చరణ్‌రాజ్, ముఖ్య సలహాదారులు నూనె పద్మ, గొర్రె నవీన్, దండెం రతన్‌కుమార్, కోల వెంకటేశ్వర్లు, బొమ్మగాని కుమారస్వామి, నల్ల శేఖర్, ఎండి.హుస్సేన్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ములుకల వినోదసాంబయ్య, ఎలకంటి విజయ్‌కుమార్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనె పద్మ, ఓబీసీ సెల్ పట్టణ ఉపాధ్యక్షులు ఓర్సు సాంబయ్య, ఓబీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాడెం నగేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామానంద్

‘పథకాలను సద్వినియోగం చేసుకోవాలి’



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న

నర్సంపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్ది స్వప్న, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మూర్తి వేర్వేరుగా వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గొల్ల కురుమలకు అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, సహాయ కార్యదర్శి కుండె లింగస్వామి, వంశీకృష్ణయాదవ్, కౌన్సిలర్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, ఐలయ్య, కుమారస్వామి, రాజు, వెంకటేశ్వర్లు, సుమన్, పండుగ అశోక్, రాజ్‌కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వర్ధన్నపేట : ఎవరికైనా ఆపద వస్తే వారిని ఆదుకునేందుకు బంధువుల కంటే స్నేహితులు ఎంతో అసరాగా ఉంటారని నిరూపించారు ఈ మిత్రులు. మండలంలోని ఇల్లందకు చెందిన శంకపెల్లి సాంబయ్య (53) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సాంబయ్య స్నేహితులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.21 వేలు అందజేశారు. అదేవిధంగా సాంబయ్య కుమారుడు రాజేష్ స్నేహితులు సైతం రూ. 11 వేలు అందించారు. కష్టంలో ఉన్నప్పుడు ఆదుకునేవారు స్నేహితులు మాత్రమే అని వీరు నిరూపించారని గ్రామస్తులు అభినందించారు. పరామర్శించిన వారిలో స్నేహితులు మోడెం కుమారస్వామి, పెంచాల కుమారస్వామి, పాల మధుసూదన్, అడ్లూరి కృష్ణమూర్తి, సట్ల చంద్రమౌళి, పండుగ వెంకటయ్య, వెంకటస్వామి, కస్తూరి బాలరాజు, కుమారస్వామి, రాజేష్ స్నేహితులు మోడెం రఘుమాధవ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నర్సంపేట : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ పాలనలో విద్యార్థుల జీవితాలు సతమతమవుతున్నాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు, కాలేజి యాజమాన్యం ఫీజుల ఒత్తిడి తేవడం పేద విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో మనోవేదనకు గురై విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచాల సతీష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాల్నె జగన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శిసామల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఠాకూర్‌విజయ్‌సింగ్, కక్కెర్ల శివమణి, కోలా హేమంత్‌గౌడ్, భవాని శంకర్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువమోర్చా నాయకులు

స్కాలర్‌షిప్‌లను వెంటనే అందించాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట: విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ వైఖరికి నిరసనగా వర్ధన్నపేట పట్టణంలో జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల జీవితాలు బాగుపడకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేష్, రాయపురం కుమారస్వామి, యాకయ్య, మహేందర్‌రెడ్డి, చీటూరి రాజు, కొండేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో పారదర్శకత

- జిల్లా సెక్టోరియల్ అధికారి సారయ్యనాయక్

నెక్కొండ: ప్రభుత్వం వివిధ పద్దుల కింద మంజూరు చేసిన నిధుల వినియోగంలో పారదర్శకతను పెంచేందుకే పీఎఫ్ఎంఎస్ విధానం అమలులోకి తెచ్చారని జిల్లా ఫైనాన్షియల్ అకౌంట్స్ అధికారి(డీఎఫ్ఏఓ), జిల్లా సెక్టోరియల్ అధికారి సారయ్యనాయక్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం పీఎఫ్ఎంఎస్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కాంప్లెక్స్, ఎమ్మార్సీలకు కాంటింజెన్సీ నిధులు మంజూరై బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని, మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని వినియోగించుకోవాలన్నారు. గతంలో మాదిరిగా ఖర్చు చేసిన మొత్తాలకు బ్యాంక్ చెక్కులు ఇవ్వడానికి బదులుగా పీపీఏ(ప్రింట్ పేమెంట్ అడ్వైజ్)లు జారీ చేయడం ద్వారా చెల్లింపులు చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓ రత్నమాల, హైస్కూల్ హెచ్‌ఎంలు రంగారావు, శ్రీధర్, శ్రవణ్‌కుమార్, జ్యోతిలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, కస్తూర్బా గురుకుల ఎస్ఓ సరిత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్, సీఆర్పీలు సుమలత, దేవేందర్, రమేష్, లావణ్య, జ్యోతి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



నెక్కొండ : మాట్లాడుతున్న సారయ్యనాయక్

సంగెం: ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన నిధులు సద్వినియోగం అయ్యేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని ఏఎంఓ కె. సారయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిధుల వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో నిధులను ఏ విధంగా ఖర్చు చేయాలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్, సిస్టం అనాలసిస్ట్ చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

240 మందికి కంటి పరీక్షలు

దుగ్గొండి : స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు కేశవాపురం పీహెచ్‌సీల్లో రెండో రోజు శుక్రవారం 240 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు కిరణ్‌రాజ్, విజయ్‌కుమార్ తెలిపారు. 91 మందికి కంటిఅద్దాలు అందించారు. 33 మందికి దగ్గరి, దూరపు చూపు కలిసి ఉన్న కంటి అద్దాల కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేశారు. 39 మందికి కంటి పరీక్షలు అవసరమని గుర్తించి వరంగల్ కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు.

పర్వతగిరి: మండల కేంద్రంలో చేపట్టిన శుక్రవారం మహిళలు, పురుషులు, వృద్ధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని డాక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు.



పర్వతగిరి : కంటిపరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన మహిళలు

ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులు



రాయపర్తి: ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశకులు అని జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎంపీడీఓ జి.కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట టీపీటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ మార్గంలో నడిపించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడవెల్లి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బండుగు ప్రసాద్, ముదురుకోల సతీష్‌కుమార్, కె.సురేందర్, సుధీర్, పద్మావతి, లక్ష్మీ, కోమల, ఫర్హాన, శ్రీనివాసులు, సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు బ్లాక్‌బెల్ట్ ప్రదానం



సంగెం: మండలంలోని కుంటపల్లికి చెందిన నిమ్మనబోయిన శ్రీనివాస్‌కు చోటోకాన్ కరాటే ఇంటర్‌నేషనల్ నుంచి బ్లాక్ బెల్టు 6వ డాన్‌ను సినీనటుడు సుమన్ చేతులమీదుగా హైదరాబాద్‌లో గురువారం రాత్రి అందుకున్నారు. ఈ సందర్భంగా సుమన్ నుంచి కరాటేలో పలు అంశాల్లో మెలకువలు నేర్చుకున్నట్లు తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగెం, గీసుకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో నెల రోజులపాటు బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణకు శ్రీనివాస్ ఎంపికైనట్లు తెలిపారు.

ఆర్టీసీలోనే ప్రయాణం సురక్షితం

నెక్కొండ : ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించొద్దని ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జె. విజయ్ అన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసీ సేవలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకొర్పోలులో శుక్రవారం గ్రామస్తులకు పలు విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నుంచి గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు తగ్గాయన్నారు. ఇక నుంచి పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ సేవలు అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఆర్టీసీ అందిస్తున్న పథకాలు, సేవలు, రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహ్మద్ మైబూబ్‌పాషా, ఎంపీటీసీ కర్ర సుకన్య, ఆర్టీసీ సూపరింటెండెంట్ అజిమొద్దీన్, కంట్రోలర్ ఎంఎస్. రెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ వెంకటనర్సమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తునుద్దేశించి మాట్లాడుతున్న విజయ్

జీపీ బావినీటితో పంట సాగు



మంచినీటి బావికి బిగించిన మోటర్

చెన్నారావుపేట: మండలంలోని శంకరంతండా గ్రామ పంచాయతీ మంచినీటి బావి నీటితో ఓ రైతు పంటలు సాగు చేస్తున్నా అధికారులు, పాలకులు చోద్యం చూసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తండావాసుల కథనం ప్రకారం.. ఇదే తండాలో గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రభుత్వ మంచినీటి బావి ఉంది. తండాకు చెందిన ధారావత్ వస్తం బావిలో అక్రమంగా మోటర్ బిగించి తన మొక్కజొన్న పంటకు నీటిని వాడుకుంటున్నాడు. ఆరు నెలలుగా బావిలోని తాగునీటిని అక్రమంగా తరలిస్తూ పంటలు సాగుచేస్తున్నాడని ఆరోపించారు. సర్పంచ్ భద్రు, కార్యదర్శి ప్రమీలకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీరు అక్రమంగా వాడుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం న్యూస్

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై చీటింగ్ కేసు



వర్ధన్నపేట: పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఎస్సై రామారావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో 10 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, ఒక కోళ్ల వ్యాన్‌లకు నంబర్‌ప్లేట్లు లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. అదే విధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెన్నారావుపేట : నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు ఆదేశాల మేరకు నంబర్‌లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. నంబర్ ప్లేట్‌లేని మూడు వాహనాలను సీజ్ చేసి ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


గీసుకొండ: నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా వరంగల్–నర్సంపేట రహదారిపై నెంబర్‌ప్లేట్ లేకుండా బైక్ నడుపుతున్న కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన బానోతు మోహన్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

విద్యుత్ తీగలు తగిలి ఒకరికి గాయాలు

పర్వతగిరి : విద్యుత్ తీగలు తగిలి ఓ రైతుకు గాయాలైన సంఘటన మండలంలోని కల్లెడ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను పనుల నిమిత్తం వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా 11కేవీ విద్యుత్ లైన్ వేలాడుతూ ఉంది. అటు వైపుగా వెళుతున్న శ్రీనుకు తీగలు తగిలి కరెంటు షాక్‌కు గురై కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యంతో గతంలో అన్నారం పెద్దతండాలో విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందాడని వాపోయారు. వేలాడుతున్న తీగలను సరిచేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

శివుడికి జలాభిషేకం

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మహిళలు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి శివుడికి జలాభిషేకం చేశారు.



యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఖానాపురం : యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిసలు కావద్దని, తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యాభ్యాసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు శివరాత్రి అనిల్, ప్రశాంత్, రాకేష్, మహేష్, తిరుపతి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై తిరుపతి